ఐదు లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల

ఓటమికి కుట్ర

మొదటి పేజీ తరువాయి...

నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించడానికి బీజేపీ సహకరించిందని, ఇప్పుడు బీజేపీ గెలవడానికి బీఆర్ఎస్ సహకరిస్తోందని ఆరోపించారు. "సామాజిక న్యాయం కాంగ్రెసతోనే సాధ్యం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా సామాజికవర్గ కూర్పు ఆధారంగా టికెట్లు ఇచ్చాం. బీసీ బిడ్డ నీలం మధుకు కాంగ్రెస్ మెదక్ టికెట్ ఇస్తే.. కేసీఆర్ వెంకట్రామి రెడ్డికి ఇచ్చారు. ఇదే ఆ పార్టీ విధానం. 119 నియోజక వర్గాల్లో 10 శాతం ఉన్న ముదిరాజ్ బిడ్డలను బీఆర్ఎస్ పట్టించుకోలేదు. మేం టికెట్ ఇచ్చి మరీ మక్తల్ ఎమ్మెల్యేగా వాకిటి శ్రీహరిని గెలిపించుకున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 14 పార్లమెంట్ స్థానాల్లో గెలిస్తే ముదిరాజ్ బిడ్డను ఆగస్టు 15లోపు మంత్రిని చేస్తాను" అని హామీ ఇచ్చారు. బీసీ ఏలో ఉన్న ముదిరాజ్‌లను ప్రత్యేక పరిస్థితుల్లో బీసీ డీలోకి మార్చారని, ఆ కేసు సుప్రీం కోర్టులో ఉందని, పదేళ్లుగా ఆ కేసులో కేసీఆర్ సర్కారు వాదనలు వినిపించలేదని తప్పుబట్టారు. "మాదిగల ఏబీసీడీ వర్గీకరణను పదేళ్లు కేసీఆర్ పట్టించుకోలేదు. మేం అధికారం చేపట్టిన తర్వాత మంత్రి రాజనర్సింహతోపాటు ఎనిమిది మంది ఎమ్మెల్యేలను పంపించి సుప్రీంలో కేసు వాదిస్తున్నాం. వర్గీకరణ కోసం పోరాడుతున్న మంద కృష్ణకు పలుమార్లు మద్దతు తెలిపాం. అసెంబ్లీలో గళం విప్పి మార్షల్స్‌తో గెంటేయించుకున్నాం" అని గుర్తు చేశారు. దళిత నాయకులు సిరిసిల్ల రాజయ్య, సంపత్‌కుమార్, పాల్వాయి రజిని, ప్రీతంకుమార్‌కు పదవులు ఇచ్చామని, సర్వే సత్యనారాయణ కుమార్తె, దళిత ఐఏఎస్ సంగీతను తన పేషీలో నియమించుకున్నామని చెప్పారు. కురుమ బిడ్డకు సీటు ఇస్తే డీకే అరుణ అల్లుడి కోసం ఆమెను ఓడించారని, వారికి అన్యాయం జరిగిందని గుర్తించి అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ ఇచ్చామని వివరించారు.

నన్నెందుకు ఓడించాలి!?

అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సహచర మంత్రులతో కలిసి సెలవు కూడా తీసుకోకుండా రోజుకు 18 గంటలపాటు పని చేస్తున్నామని, పదేళ్లలో చేసిన వందేళ్ల విధ్వంసాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. "మహిళలకు గ్యాస్ సిలిండర్ ఇచ్చాం. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచాం. పేదలకు 200 యూనిట్లలోపు ఉచితంగా కరెంటు ఇస్తున్నాం. నియోజక వర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ. 22,500 కోట్లు మంజూరు చేశాం. 60 ఏళ్లుగా పోరాడుతున్న బీసీ గణనకు అనుకూలంగా అసెంబ్లీలో బిల్లు పాస్ చేశాం. 126 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చాం. ఇందుకేనా రేవంత్ రెడ్డిని ఓడగొట్టాలని, ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఆలోచన చేస్తున్నారు!?" అని బీజేపీ, బీఆర్ఎస్‌లపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వంద రోజులుగా అధికారంలో ఉన్న తనను గద్దె దించాలని అంటున్న బీఆర్ఎస్ నేతలు.. పదేళ్లుగా ప్రధానిగా ఉన్న మోదీని గద్దె దించాలని ఎందుకు కోరడం లేదని నిలదీశారు. "పాలమూరు బిడ్డగా ముఖ్యమంత్రిగా పని చేసే హక్కు నాకు లేదా!? దొరలే ఎప్పుడూ సీఎం కావాలా!? వారు కాకపోతే వారి కొడుకులే కావాలా!?" అని ప్రశ్నించారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పాలమూరు ప్రజలకు అందకుండా ఎమ్మెల్సీ కోడ్‌తో బీజేపీ కుట్ర పన్నిందని విమర్శించారు. కోడ్ ముగిసిన వెంటనే రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను పాలమూరులో కూడా అమలు చేస్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని, కాంగ్రెస్ కార్యకర్తలు ఏమాత్రం ఏమరపాటుగా ఉండొద్దని, కుట్రలు చేస్తున్న వారిని అడ్డుకొని, ప్రతి బూత్, గ్రామంలో మెజారిటీ తెచ్చేందుకు కష్టపడితే ఆ ఎన్నికల్లో టికెట్లు ఇచ్చి గెలిపించుకునే బాధ్యత పార్టీ తీసుకుంటుందని అన్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసి సంక్షేమ పథకాలను కార్యకర్తల చేతులమీదుగానే అందజేస్తామన్నారు. ఉమ్మడి పాలమూరులో రెండు పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సభలో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, పర్ణికారెడ్డి, శంకర్, వాకిటి శ్రీహరి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు.

వాకిటి శ్రీహరికి మంత్రి పదవి!?
సీఎం రేవంత్ వ్యాఖ్యలతో ఊహాగానాలు

నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని మంత్రి పదవి వరించనుందా!? కాంగ్రెస్ జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య ఆయన గురించేనా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి కాంగ్రెస్ పార్టీ వర్గాలు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 14 స్థానాలు ఇస్తే ముదిరాజ్ బిడ్డకు ఆగస్టు 15లోపు మంత్రి పదవి ఇస్తానని సీఎం రేవంత్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన ఏకైక ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాత్రమే. దీనికితోడు, మంత్రివర్గ విస్తరణ పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఉంటుందని అంతా భావిస్తున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో మంత్రివర్గ విస్తరణ చేయలేదు. రేవంత్ రెడ్డితోపాటు 11 మంది మంత్రులు మాత్రమే ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రివర్గంలో మరో ఆరుగురికి అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే వచ్చే మంత్రివర్గ విస్తరణలో వాకిటికి అవకాశం ఉంటుందంటూ ఊహాగానాలు చెలరేగుతున్నాయి.

చివరి గింజ వరకూ కొంటాం

- ఇప్పటికే 2.69 లక్షల టన్నుల ధాన్యం కొన్నాం
- మార్చి 23నే కొనుగోళ్లు ప్రారంభించాం
- రైతులు తక్కువ ధరకు అమ్ముకోవద్దు
- బీజేపీ, బీఆర్ఎస్‌లవి తప్పుడు ఆరోపణలు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 15 : ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 23 నుంచే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు 2,69,699 మెట్రిక్ టన్నుల మేరకు కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు. మారుమూల గ్రామాన్ని కూడా వదలిపెట్టకుండా చివరి గింజవరకూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి, ఎమ్మెల్యే మందుల సామ్యేలుతో కలిసి ఉత్తమ్ మాట్లాడారు. ధాన్యం కొనుగోలు, రేషన్ సరఫరాల్లో ప్రభుత్వం సమర్థంగా ముందుకు వెళుతోందని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లు ఈ ఏడాది జరిగినంత సమర్థంగా గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. గత ఏడాది (2022-23) ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 9న ప్రారంభిస్తే.. ఈ ఏడాది తాము మార్చి 23నే ప్రారంభించినట్లు తెలిపారు. నిరుడు మొత్తం 7031 కేంద్రాలను ఏర్పాటు చేస్తే.. ఈసారి తాము 7149 ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 6919 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. సిద్దిపేటలో గత ఏడాది ఈ సమయానికి ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభం కాలేదని, ప్రస్తుతం 418 కేంద్రాల్లో ధాన్యం కొంటున్నారని మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు ఇప్పటికే అందుబాటులో ఉంచామన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. రాష్ట్రంలోని రైతులు ఒక్క ధాన్యపు గింజను కూడా మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవద్దని సూచించారు. "నిల్వ ఉన్న యాసంగి ధాన్యాన్ని గత ప్రభుత్వం ఎక్కువగా కొనుగోలు చేసింది. ఆ తర్వాత ధాన్యం పాడవుతుందని చెప్పి అమ్మకానికి పెడితే క్వింటాలుకు రూ. 1702 ధర వచ్చింది. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత కమిటీ వేసి అదే ధాన్యాన్ని అమ్మితే క్వింటాలుకు రూ. 2022 చొప్పున వచ్చింది. ధాన్యం వేలం ద్వారా రూ. 1110.05 కోట్లు అదనంగా వచ్చాయి" అని ఉత్తమ్ వెల్లడించారు. గత ప్రభుత్వంలో సన్నబియ్యానికి, దొడ్డు బియ్యానికి తేడా లేకుండా వేలంలో అమ్మేశారని ఆరోపించారు. పౌరసరఫరాల శాఖను గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా నడిపిందన్నారు. ప్రతి జిల్లాలో రేషన్ బియ్యం రీసైకిలింగ్ మాఫియా తయారైందని చెప్పారు.

జూన్ 9న ప్రధానిగా రాహుల్ ప్రమాణం... లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి 272 సీట్ల కంటే ఎక్కువగా గెలుచుకుంటుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 9న ప్రధానమంత్రిగా రాహుల్‌గాంధీ ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి కచ్చితంగా గెలుస్తుందని చెప్పారు. దేశ చరిత్రలో 70 రోజుల్లోనే 5 గ్యారెంటీలు అమలు చేసిన ప్రభుత్వం తమదేనన్నారు. వంద హామీలు ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ.. పదేళ్లు అధికారంలో ఉండి కూడా వాటిని అమలు చేయలేదని ఆరోపించారు.

కాంగ్రెస్ 5 ఎంపీ స్థానాలు గెలువడం కష్టం

మొదటి పేజీ తరువాయి...

కంటోన్మెంట్ లో మాదిగలకు టిక్కెట్ ఎందుకు ఇవ్వలేదు

కంటోన్మెంట్ నియోజకవర్గంలో మాదిగలు మెజార్టీ సంఖ్యలో ఉన్నారని, అటువంటి వారికి బీఆర్ఎస్,కాంగ్రెస్ లు ఎందుకు టిక్కెట్ ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇక బీజేపీ మాదిగలకు టిక్కెట్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ లు మాదిగలకు టిక్కెట్ ఇవ్వకుండా అవమానించారని స్పష్టం చేశారు.మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రాబోయో కాలంలో రాజకీయ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాదిగలకు ఎంపీలుగా పోటీ చేసే అవకాశం కల్పించకుండా మోసం చేశారని, గోబ్యాక్ పేరిట ఉద్యమాన్నిఉధృతం చేస్తామని హెచ్చరించారు. కంటోన్మెంట్ ఉపఎన్నిక్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు శ్రీగణేష్ అర్వ మాల కాగా,సాయన్న కూతురు నివేదిత స్థానిక మాల అని స్పష్టం చేశారు. కానీసం బీజేపీ అయినా స్థానిక మాదిగకు అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.ఈ కార్యక్రమంలో MRPS తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ MRPS,MSP హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు TV నర్సింహా మాదిగ,MSP హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డప్పు మల్లికార్జున మాదిగ, MSP

హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి అజిత్ వాల్మీకి, MSP జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రి సతీష్ మాదిగ, MRPS తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ,MSF తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కంపల్లి శ్రీకాంత్ మాదిగ,MRPS కంటోన్మెంట్ నాయకులు మంద మధుకర్ మాదిగ, MRPS కంటోన్మెంట్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ కేసులో కవితకు తొమ్మిది రోజుల

జ్యూడీషియల్ కస్టడీ

మొదటి పేజీ తరువాయి...

న్యాయస్థానంలో ప్రవేశ పెట్టిన సీబీఐ.. ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించాలని కోరింది. అయితే.. ఢిల్లీ మద్యం కేసులోనే కవితకు ఈ నెల 23వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ గతంలోనే కోర్టు తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో సీబీఐ కేసులో సైతం ఆమెకు న్యాయమూర్తి తొమ్మిదిరోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ఈ నెల 23న మళ్లీ న్యాయస్థానం ఎదుట హాజరు పరచాలని ఆదేశించారు. కాగా, కవిత మూడురోజుల సీబీఐ విచారణకు సంబంధించి 11 పేజీల రిపోర్టుకు దర్యాప్తు సంస్థ కోర్టుకు సమర్పించింది. సీబీఐ తరపున న్యాయవాది పంకజ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. మద్యం కేసుకు సంబంధించిన ఆధారాలు, సహ నిందితుల వాంగ్మూలాలు ముందు పెట్టి మరీ కవితను ప్రశ్నించామని తెలిపారు. కానీ, విచారణకు ఆమె సహకరించలేదని, సరైన సమాధానాలు చెప్పలేదని న్యాయస్థానానికి వెల్లడించారు.

ఆధారాలు ముందు పెట్టి ప్రశ్నించినా..

"నిందితుడు గోరంట్ల బుచ్చిబాబు మొబైల్ ఫోన్లలో లభించిన వాట్సాప్ సంభాషణలు, సాక్షులు, అప్రూవర్ల స్టేట్‌మెంట్ల ఆధారంగా కవితను ప్రశ్నించాం. మహబూబ్‌నగర్‌లో భూమి కుంభకోణం పేరుతో డబ్బు మళ్లింపు, ఆమ్ ఆద్మీ పార్టీకి విజయ్ నాయర్, ఇతర నిందితుల ద్వారా రూ. 100 కోట్లు మళ్లించడం, ఆ డబ్బును ఇతరుల నుంచి వసూలు చేయడంలో కవిత పాత్రపై ప్రశ్నించాం. శరత్ చంద్రారెడ్డి నుంచి తీసుకున్న రూ. 14 కోట్ల గురించి కూడా విచారించాం. అలాగే మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శరత్ చంద్రారెడ్డి, విజయ్ నాయర్ సహా నిందితులతో జరిగిన సమావేశాల గురించి ప్రశ్నించాం. కానీ, నగదు బదిలీల గురించి కవిత సరైన సమాధానాలు ఇవ్వలేదు. ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించేలా సమాధానాలు చెప్పారు. కవిత ప్రముఖ రాజకీయ నాయకురాలు. సమాజాన్ని ప్రభావితం చేస్తే మహిళ. ఆమె బయటికి వెళితే సాక్షులను బెదిరించే అవకాశం ఉంది. ఢిల్లీ మద్యం కేసు కీలక దశలో ఉంది. ఇప్పుడు కవిత బయటికి వెళితే కేసుపై ప్రభావం పడుతుంది. మరికొంత మందిని విచారించాల్సి ఉంది. మరిన్ని కీలక ఆధారాలను, డిజిటల్ పరికరాలను పరిశీలించాల్సి ఉంది. అందుకే కవితకు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించండి" అని న్యాయస్థానాన్ని పంకజ్‌కుమార్ కోరారు. ఇదిలా ఉండగా. ఈడీ కేసుకు సంబంధించి కవిత దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టులో మంగళవారం విచారణ జరగనుంది. మరోవైపు సీబీఐ అరెస్టుకు సంబంధించి కవిత మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై 20వ తేదీలోపు కౌంటర్ దాఖలు చేయాలంటూ సీబీఐకి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 22న విచారణ చేపడతామని పేర్కొంది.

అనారోగ్య సమస్యలున్నాయి.. బెయిలివ్వండి: కవిత

సీబీఐ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సోమవారం రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించిన కవిత.. అందుకు తన అనారోగ్య సమస్యలను ప్రస్తావించారు. ఇందుకు సంబంధించిన మెడికల్ రిపోర్టులను జత చేశారు. ఈ కేసులో సహ నిందితులకు బెయిల్ ఇచ్చారని, అలాగే తనకూ బెయిల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కవిత తరపు న్యాయవాది మోహిత్‌రావు 664 పేజీలతో కూడిన బెయిల్ పిటిషన్ వేశారు.

పిటిషన్‌లో కవిత పేర్కొన్న కొన్ని కీలక అంశాలు..

20 ఏళ్ల క్రితం చేతి మణికట్టు వద్ద ఎముక విరిగింది. అది ప్రస్తుతం నన్నెంతో బాధిస్తోంది.
2013లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నారు.
2020లో గర్భసంచి సంబంధిత వ్యాధితో బాధపడ్డాను.
2023లో అల్సర్ మొదలైంది. ఆ సమస్య నన్నెంతో బాధిస్తోంది.
బీపీతో బాధ పడుతున్నాను. మార్చి 16న ఈడీ కస్టడీలో ఉన్నప్పుడు రాత్రి 12.15 గంటలకు బీపీ చెక్ చేయగా.. 186/103గా నమోదైంది. దీంతో అదేరోజు రాత్రి 3:35 గంటలకువైద్యులు చికిత్స అందించారు.
బీఆర్ఎస్ పార్టీ తరపున నేను స్టార్ క్యాంపెయినర్‌ను. అందుకే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ కు ఒకరోజు ముందు ఈడీ అరెస్టు చేసింది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించడానికి 10 రోజుల ముందు సీబీఐ అరెస్టు చేసింది.
చార్జిషీట్‌లో నా పేరు లేదు. మొదట నన్ను సాక్షిగా మాత్రమే విచారించారు. ఆ తర్వాత రాజకీయ కోణంలోనే నన్ను అరెస్టు చేశారు.
ఈ కేసు గురించి నాకు ఏమీ తెలియదు. ఈడీ, సీబీఐ ఒకే ప్రశ్నలు మళ్లీ మళ్లీ అడుగుతున్నాయి. నేనేమీ చెప్పడం లేదని ఈడీ, సీబీఐ చెబుతున్నాయి. ఆ సాకుతో ఎన్నికలు ముగ్గిస వరకూ నన్ను జైల్లోనే ఉంచాలని చూస్తున్నారు. నాకేమీ తెలియదు కాబట్టే ఎన్నిసార్లు అడిగీనా నేనేమీ చెప్పడం లేదు.
కేసు విచారణలో ఉన్నందున ట్రయల్ ప్రారంభం కావడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది. అందుకే బెయిల్ ఇవ్వండి.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

ఏడాదికి లక్ష రూపాయలు అందిస్తామన్నారు.రైతు వ్యతిరేక పార్టీ బీజేపీ అని,పదేళ్లలో దేశంలో రైతులు పండించిం పంటలకు కనీస మద్దతు ధర కూడా కల్పించలేదని విమర్శించారు.ఢిల్లీలో దీక్ష చేపట్టిన ఎందరో రైతుల ప్రాణాలు బీజేపీ బలి తీసుకుందన్నారు.మతతత్వ పార్టీ బీజేపీకి పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో అధికారం కట్ట పెట్టాలన్నారు.కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ. 500లకే గ్యాస్ సిలిండర్,రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంపు,200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు చేస్తున్నామన్నారు.రాబోయే ఐదేళ్లలో ప్రతి హామీని తమ ప్రభుత్వం పూర్తి చేస్తుందని,హామీలను అమలు చేయనప్పుడు బీఆర్ఎస్,బీజేపీ పార్టీలు తమను ప్రశ్నించాలన్నారు. పెద్దపల్లి జిల్లాలోని టేలండ్ ప్రాంతా రైతులకు సాగునీరు అందించేందుకు తనతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నారని,దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.పత్తిపాక రిజర్వాయర్ ఐదేళ్లలో ఖచ్చితంగా పూర్తి చేసిన తర్వాతే తిరిగి ఎన్నికల్లో నిలబడుతామన్నారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే సమయంలో క్వింటాలుకు 10 కిలోల చొప్పున తరుగు తీసారన్నారు.తాము అధికారంలోకి వచ్చినప్పటినుండి గింజ తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు.స్వామి నాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తామని హామీ ఇచ్చారు.పెద్దపల్లి,సుల్తానాబాద్ లలో బైపాస్ రోడ్డు నిర్మిస్తామని, ఇప్పటికే ప్రక్రియ ప్రారంభించామని చెప్పారు.మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికులతో పాటు అంగన్వాడీ కార్మికులకు వేతనాలు పెంచుతామన్నారు.వేతన సవరణలో మార్పులు తెస్తామని భరోసా ఇచ్చారు.పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డంవంశీకృష్ణనుఅత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

మానేరు ఇసుక తరలింపు అడ్డుకుంటా
-ఎమ్మెల్యే విజయరమణా రావు

మానేరు వాగులో నుండి ఇసుక తరలించకుండా అడ్డుకుని తీరుతానని,అవసరమైతె ఎమ్మెల్యే పదవినైనా వదులుకుంటామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు తీవ్రంగా స్పందించారు.తనకు ఎలాంటి లాభాపేక్ష లేదని,ఈ ప్రాంత సహజ వనరులు దోచుకెళ్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలకుల మాదిరిగా చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు.నియోజకవర్గ ప్రజల అభీష్టం మేరకు నడుచుకుంటానని హామీ ఇచ్చారు.పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ గెలుపే లక్ష్యం పార్టీ శ్రేణులు పని చేయాలని పిలుపునిచ్చారు.పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మినిమమ్ వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్,జడ్పీటిసిలు మినుపాల స్వరూప-ప్రకాష్ రావు,బొద్దుల లక్ష్మన్,బండారి రాంమూర్తి,మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్,భూషనవేణ సురేష్ గౌడ్,ఎంపీపీలు,సర్పంచులు,ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు,పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడీ పాలనలో ప్రమాదపుటంచున ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్య పరిరక్షణకు కమ్యూనిస్టు వామపక్ష శక్తులు ఏకం కావాలి - వామపక్షాల జిల్లా సదస్సులో రాష్ట్ర నేతలు

ఏప్రిల్ 15, నర్సంపేట ప్రజాకలం ప్రతినిధి బిజెపి మోడీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదం అంచున నిలిచిందని భారత రాజ్యాంగ పరిరక్షించి దేశాన్ని కాపాడడానికి క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యపరిచేందుకు కమ్యూనిస్టు వామపక్ష శక్తులు ఐక్యంగా ముందుకు సాగాలని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి సిపిఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కే గోవర్ధన్ సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న పిలుపునిచ్చారు. ఈరోజు వామపక్ష కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలు-మతోన్మాదం అనే అంశంపై జిల్లా సదస్సు ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ సిపిఎం జిల్లా నాయకుడు సింగారపు బాబు న్యూ డెమోక్రసీ మాస్ లైన్ ఆర్ఎస్పి బాధ్యులు చిర్ర సూరి గంగుల దయాకర్ వల్లందాస్ కుమార్ సిపిఐ (ఎంఎల్) ఈర్ల పైడి అధ్యక్ష వర్గంగా వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్ ఆవరణలో జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంలో బిజెపి మోడీ ప్రభుత్వం లౌకిక ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చి నియంతృత్వ పోకడలతో మతం పేరుతో రాజకీయాలు చేస్తూ గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ ప్రజలపై భారాలు వేస్తున్నారని నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తూ వస్తున్నారని అలాగే ప్రజాస్వామ్య బద్ధంగా జరుపాల్సిన పార్లమెంటు ఎన్నికలను సైతం ప్రతిపక్ష పార్టీల అకౌంట్లను సీజ్ చేసి అక్రమ అరెస్టులకు పూకునుకున్నారని వ్యవసాయక దేశాన్ని కార్పొరేట్ దోపిడీ దేశంగా మార్చి వేశారని రైతుల కూలీల కార్మిక హక్కులు కాల రాశారని ఆందోళన వ్యక్తం చేశారు.ఇలాంటి పరిస్థితిలో బిజెపి మోడీ నుంచి దేశాన్ని కాపాడడానికి క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు.

ఈకార్యక్రమంలో వామపక్ష పార్టీల జిల్లా నాయకులు గోనె కుమారస్వామి కుసుంబ బాబురావు రాచర్ల బాలరాజు మంద రవి ఈసంపల్లి బాబు కౌధగాని శివాజీ సుదమల్ల భాస్కర్ మాస్ సావిత్రి నలిగంటి రత్నమాల కనకం సంధ్య నున్న అప్పారావు బండి కోటేశ్వరరావు ఎండి బషీర్ కుమారస్వామి నాగిల్ల కొమురయ్య కన్నం వెంకన్న దర్గయ్య గోవర్ధన్ రాజు ఐతం నాగేష్ లతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కారును ప్రారంభించిన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

తల్లాడ ఏప్రిల్ 15 (ప్రజా కలం న్యూస్) : కాంగ్రెస్ పార్టీ తల్లాడ పట్టణ అధ్యక్షులు, నీలాద్రి దేవస్థానం ఆలయ డైరెక్టర్ దగ్గుల నాగిరెడ్డి నూతన కారును కొనుగోలు చేశారు. సోమవారం తల్లాడలోని శివాలయములో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కారును సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కారులో కొద్దిసేపు ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట అన్నారుగూడెం మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్ ఉన్నారు.